# పలికించెడివాడు

బట్టల కొట్లో చీర బేరం చేస్తున్నాడు కొండమాచార్యులు. ఆ సమయంలో.. 'మేస్టారూ' అన్న పిలుపు వినిపించి వెనక్కుతిరిగాడాయన.

ఒక యువతి..సన్నగా, పొడుగ్గా ఆధునికంగా ఉంది. ఆయన్ను చూసి స్నేహపూర్వకంగా నవ్వుతోంది.

కొండమాచార్యులకామె ఎవరో స్ఫురించలేదు.

''నన్ను గుర్తు పట్టలేదా మాస్టారూ..కవితను'' అందామె - తన నల్లద్దాల కళ్ళజోడు తీసి!

కవిత అనగానే కొండమాచార్యులకామె ఎవరో గుర్తొచ్చినట్లుంది... ''నువ్వు కవితవా.. బాగా మారిపోయావమ్మా''! అన్నారాయన.

''మీరు మాత్రం అప్పటికీ, ఇప్పటికీ ఏమీ మారలేదు. అందుకే సులభంగా గుర్తు పట్టగలిగాను. మీ బేరం పూర్తికాగానే ఇంటికి వెళదాం'' అందామె.

ఆమె ఎదురుగా చీర బేరమాడ్డానికి మొహమాటపడి, ''ఇదిప్పుడంత అర్జెంటు

కాదమ్మా.. ముందు మీఇంటికే వెళదాం పద" అన్నాడాయన.

కవిత ఆయన్ను తనింటికి తీసుకెళ్లాలని ఆత్రతపడుతోంది. అందుకే వెంటనే "రండి, మేస్టారూ!" అంది.

కొండమాచార్యులు దుకాణం వాడికి మళ్లీ వస్తానని చెప్పాడు. వాడు కూడా వినయంగా... "మంచిది బాబూ. తమరు తిరిగొచ్చేసరికింకా మంచి వెరైటీ తెప్పించి ఉంచుతా!" అన్నాడు.

కవిత రాకకు ముందు వాడిలో ఆ వినయం లేదని కొండమాచార్యులుకి గుర్తుంది. ఆయన బయటకు నడిచాడు.

ఇప్పుడు కవిత హోదా ఏమిటో తెలపడానికన్నట్టు అక్కడ కారొకటుంది. కార్లో డ్రైవరున్నాడు. కవిత రాగానే వాడు బయటకు వచ్చి వినయంగా కారు బాక్ డోర్ తెరిచాడు.

కవిత కార్లో తను కూర్చుని, ఆయన్నూ ఆహ్వానించింది. కారు కదిలేక.."మేస్టారూ ..మీ దీవెన ఫలించింది. మా వారు డిప్యూటీ కలెక్టరు" అంది కవిత.

"చాలా బాగుందమ్మా!" అన్నాడు కొండమాచార్యులు అప్రయత్నంగా. ఆయన ఆలోచన లొక్కసారి కొన్నేళ్ళు వెనక్కు వెళ్లాయి.

అప్పటికింకా కొండమాచార్యులు రిటైరవలేదు. స్కూల్లో ఆయన సైన్సు, తెలుగు చెప్పేవారు. కవిత ఆయన స్టూడెంట్. కవిత తండ్రిది చాలా చిన్న ఉద్యోగం. ఇద్దరే పిల్లలు కాబట్టి ఏదో గుట్టుగా సంసారం చేస్తున్నాడు.

కవిత, ఆమె తమ్ముడు సుధీర్ తరచు మేస్టారింట్లో గడుపుతుండేవారు. ఆయన మాటలు వారిద్దరికీ కూడా ఇష్టం. చిన్నప్పటి నుంచీ కవితకు పుస్తకాల పిచ్చి. ఇంగ్లీషు, తెలుగు నవల్లు కూడా చదివేదామె. తన కర్థంకాని విషయాలు మేస్టారి నడిగేది.

"ఇప్పట్నించీ నువ్విలాంటివి చదవకూడదమ్మా! ఇవి నీ మనసును కలుషితం చేస్తాయి" అని ఆయన ఆమెకు మంచి నవలలు సూచించేవాడు. అవి కవితకు నచ్చేవి కావు. ఊహాల్లోకి తీసుకుపోయి ఊరిస్తుండే సాంఘిక నవలలు, అనుక్షణం వళ్ళు జలదరింపచేసే క్రైమ్ నవలలు ఆమెకు నచ్చేవి.

"నీ వయసుకవి నచ్చడంలో ఆశ్చర్యంలేదు. వాటి ఆకర్షణ నుంచి బైటపడడానికి నిన్ను నీ వదుపు చేసుకోవాలి" అనేవాడు కొండమాచార్యులు.

కవిత తన్ను తానదుపు చేసుకోలేకపోయింది. ఆ విషయమామె కొండమాచార్యుల దగ్గర ఒప్పుకునేది.

"నీలో నిజాయితీ ఉంది. అదే నిన్ను గొప్పదాన్ని చేస్తుంది" అనేవాడు కొండమాచార్యులు.

"మేస్టారూ! నా అభిరుచిలో ఏదో లోపముంది. ఆ లోపాన్నెలా దిద్దుకోవాలో మీరే చెప్పండి" అనేది కవిత.

అప్పుడు కొండమాచార్యులామెకు భాగవతం నుంచి, "మందార మకరంద మాధుర్య

మునదేలు మధుపంబు వోవునే మదనములకు'' అన్న పద్యం వినిపించి... ''మంచి సాహిత్యం చెవులబడేదాకా నీ కిలాంటి సాహిత్యం మీద మోజు పోదు'' అన్నాడు.

''మీరు చెప్పేది మంచి సాహిత్యమే అయితే అది నాకెందుకు నచ్చదు?'' అని కవిత ఎదురు ప్రశ్న వేసింది.

''మంచిని మంచిగా గ్రహించడానికి గురువుండాలి'' అని ఆయన ఆ రోజు నుంచి ఆమెకు రోజుకో కథను క్లుప్తంగా చెబుతుండేవాడు. ఆ కథలు విశ్వసాహిత్యం నుంచి గ్రహించినవి.

''మీరు చెబుతూంటే బాగుంటాయి. కానీ పుస్తకం చదవాలంటే విసుగ్గా ఉంటోంది మేస్టారూ. నా అభిరుచిలో ఏదో లోపముంది'' అందామె.

''నీ లోపాన్ని నువ్వు గ్రహించావు. ఆ సంస్కారం నిన్ను గొప్పదాన్ని చేస్తుంది. ఇది నా దీవెన'' అని కొండమాచార్యులామెకు చాలాసార్లు చెప్పాడు.

అభిరుచులెలాగున్నప్పటికీ కొండమాచార్యుల పట్ల గురుభావ ముండేది కవితకి.

''మేస్టారూ! మీరు చెప్పే గొప్పవాళ్ళ కథలు వాళ్ళ రాతల్లో కంటే మీ మాటల్లో బాగుంటున్నాయి. మీవంటి వారు కలం పడితే.. ...మావంటి వారి అభిరుచి పెరుగు తుందేమో..'' అంది కవిత ఒకసారి.

''నాలో రచయిత ఉన్నాడు కానీ ఉపాధ్యాయ పదవీ బాధ్యత నుంచి బయటపడేవరకూ నేను వాడిని బయటకు రానివ్వను. ఎందుకంటే రచయితకు కూడా సమాజం పట్ల బాధ్యత ఉంది. రెండు బాధ్యతల నొకేసారి నిర్వహించగల సామర్థ్యం చాలా కొద్దిమందికి ఉంటుంది. నేనా కొద్దిమందిలో లేను'' అన్నాడు కొండమాచార్యులామెతో.

''మీ రచనలు చదివే అదృష్టం కలగాలని కోరుకుంటున్నాను'' అంది కవిత.

ఇక రెండేళ్ళకు రిటైరవుతాడనగా కొండమాచార్యులు ట్రాన్సఫ రయ్యాడింకోఊరికి. ఆ తరువాత ఆయన కవితను మళ్ళీ ఈ రోజే చూశాడు.

కొండమాచార్యులాలోచనల్లోంచి బయటపడేసరికి ఆయన కవిత కార్లోంచి బయటపడి, ఇంట్లోకి చేరుకున్నాడు.

ఇల్లు కవిత వైభవాన్ని సూచిస్తోంది.

ఇద్దరూ సోఫాల్లో కూర్చున్నారు. కవిత మేస్టారి కుటుంబం గురించి కొన్ని ప్రశ్నలు వేసింది. తరువాత తన వివాహం గురించి చెప్పుకుంది.

కవిత అత్తగారు..గుడికి వెళ్లింది. అక్కడ కవితను చూసి ముచ్చట పడి ఆమెను కోడల్ని చేసుకోవాలనుకుంది. అంతే! కట్నం లేకుండా నిరాడంబరంగా వివాహం జరిగి పోయింది. వివాహమైన ఏడాదికే అతడు ఐఏఎస్ లో సెలక్టయ్యాడు.

''పిల్లలెందరు?'' అన్నాడు కొండమాచార్యులు.,

''ఇంకా లేరు'' అంది కవిత కొద్దిగా సిగ్గుపడుతూ.

కొండమాచార్యులామెతో మాట్టాడుతూనే చుట్టూ చూస్తూ ఆమె వైభవాన్నంచనా

వేస్తున్నాడు. ఆ ఇల్లు వైభవంతో పాటు ఆమె అభిరుచికి కూడా ఉదాహరణగా ఉంది. మాటల్లో ఆ విషయం చెప్పాడాయన.

"ఇల్లు చూసి మోసపోకండి మేస్టారూ! సాహిత్యంలో నా అభిరుచులేమీ మారలేదు. నా అభిరుచి మంచిది కాదని మాత్రం ఇప్పటికీ ఒప్పుకుంటాను" అంది కవిత నవ్వుతూనే.

"అభిరుచి విషయమెలా ఉన్నా సంస్కారంలో కూడా మార్పు లేదు"

"మీరు రచనలు ప్రారంభించారా?" అంది కవిత.

కొండమాచార్యులు మాట్లాడలేదు.

"రిటైరయ్యాక రచనలు ప్రారంభిస్తానన్నారు. మనం కలుసుకోక పోయినా మీరు రిటైరై నాలుగేళ్ళయిందని నాకు తెలుసు"

"నా జీవితానుభవాన్నంతా క్రోడీకరించి ఓ నవల రాశాను. చాలా బాగా వచ్చింది. అచ్చేయిద్దామని ఓ పబ్లిషర్ దగ్గరకు తీసుకెళ్ళాను. ఆయన నవల చదివి బాగుందన్నాడు. కానీ అలాంటి నవలలు డైరెక్టుగా వేయడానికి కుదరదు. ఏ పత్రికలోనైనా సీరియల్‌గా వచ్చాక చూద్దామన్నాడు. ఓ పత్రికలో నాకు తెలిసిన ఎడిటర్‌కు చూపించాను. ఆయన సాహిత్యంలో సరుకున్నవాడు. నా నవల చదివి ఈ రోజుల్లో ఇలాంటి వాటి కాదరణ లేదన్నాడు. నేను తప్పుపట్టానే నీ అభిరుచిని! అదే ఇప్పుడు తెలుగు సాహిత్య ప్రపంచాన్నేలుతోంది. దాంతో రచనలకు స్వస్తి చెప్పాను"

కవిత నిట్టూర్చి .. "ఒకే ఒక్క నవలతో మీరు రచనలకు స్వస్తి చెప్పారా? ఇది దేశానికే దౌర్భాగ్యం" అంది.

కొండమాచార్యులు మాట్లాడలేదు.

"ఇప్పుడీఊరెందుకొచ్చారు మేస్టారూ?" అంది కవిత మాట మార్చుతూ.

ముందు తటపటాయించిన కొండమాచార్యులు నిజమే చెప్పాడు. ఆయన కొడుకు ఉద్యోగం కోసం వచ్చాడిక్కడికి. ఉద్యోగం వచ్చేలాగా ఉంది కానీ పది వేల దాకా లంచమివ్వాలి. లంచమిచ్చినా పని జరుగుతుందన్న గారంటీ లేదు. అంతా నమ్మకం మీద పోవాలి"

"లంచాలివ్వకండి మేస్టారూ! అంతా మోసం. ఇలాంటి కేసులు నాలుగైదు మావారి దృష్టికి వచ్చాయి".

"రంగా బియ్యే పాసయ్యాడమ్మా - మీ వారు వాడికేమైనా సాయం చెయ్య గలరా?" అన్నాడు కొండమాచార్యులు నోరు విడిచి.

కవిత వెంటనే పెదవి విరిచింది. "లాభంలేదు మాస్టారూ! మావారని దాచనవసరం లేదు. ఆయన బాగా డబ్బు మనిషి. డబ్బంటే లంచం తీసుకోరు.. ఏ పని చేసినా తనకేదో ప్రయోజనముండాలంటారు. సిఫారుసులు కూడా డబ్బున్న వాళ్ళు చేస్తేనే వింటారు. మీవంటి వారాయన కళ్ళకి ఆనరు. నేనిలాగన్నానని ఏమీ అనుకోకండి" అంది.

కవితకు డొంక తిరుగుడుగా మాట్లాడడం చేతకాదని కొండమాచార్యులకి తెలుసు.

అందుకే ఆయన.."ఇందులో అనుకోడానికేముందమ్మా!" అని మనస్ఫూర్తిగానే అన్నాడు.

"మా వారిప్పుడు మంచి పొజిషన్లో ఉన్నారు. సమాజంలో నా విలువ పెరిగిపోయింది. మీ వంటివారికి సాయపడాలని నాకుంటుంది. కానీ ఎలాగో చెప్పండి మేస్టారూ" అంది కవిత.

"అయితే నాకు ఒక అయిదు వేలు అప్పుగా ఇయ్యమ్మా! అమ్మాయి పెళ్ళి కట్నంలో బాకీ పడ్డాను. అల్లుడొకటే సతాయిస్తున్నాడు. చాలా ఇబ్బందిగా ఉంది. అబ్బాయికి ఉద్యోగం రాగానే నెలా నెలా వాయిదాల పద్ధతి మీద కట్టేస్తాను"

కవిత ముఖం అదోలాగైపోయింది. కాసేపిద్దరూ మాట్లాడుకోలేదు.

"మేస్టారూ! మనం ఇరవై నుంచి ఇరవై ఒకటో శతాబ్దానికి పరుగెడుతున్నాం. కానీ మన సమస్యలు మాత్రం నాగరికతకు పూర్వానివి. కూతురు పెళ్ళికి కట్నం, కొడుకు ఉద్యోగానికి లంచం, మీ సమస్యలు. కానీ నా సమస్యను మీరూహించలేరు. ఈ ఇంట్లో నేనొక ఉత్సవ విగ్రహాన్ని. నాకు స్వతంత్రం లేదు. నేను ధరించడానికి రెండు వేల రూపాయల పట్టు చీర, అలంకరించుకునేందుకు పది వేల రూపాయల ముత్యాల హారం నిరభ్యంతరంగా కొనగల నా భర్త.. నా వాళ్ళ చేతిలో వంద రూపాయలు పెట్టే స్వతంత్రం కూడా నా కివ్వలేదు" అని కవిత కళ్ళు తుడుచుకుంది.

కొండమాచార్యులకామె పరిస్థితి అర్థమైంది. దేశంలో పెద్ద హోదాలోఉన్న చాలా మంది ఆడవాళ్ళ పరిస్థితి ఇదే! ఆలోచనాశక్తి ఉంది కాబట్టి కవిత అర్థం చేసుకుంది. లేనివాళ్ళు తమ హోదాకు గర్వపడుతూ అహంకరిస్తూ ఉంటారు.

అయినా అభిమానంతో ఇంటికి పిలిచిన ఆ పిల్లకు తన అవసరాలు చెప్పుకుని బాధపెట్టినందుకు కొండమాచార్యులు నొచ్చుకున్నాడు.

"ఏదో సందర్భం వచ్చింది కాబట్టి చెప్పానమ్మా - ఏమీ అనుకోకు".

"మేస్టారూ! మీకు సాయపడాలని నా కోరిక"

"నీ సాయం నాక్కావాలమ్మా. తనకోమంచి నేత చీర కావాలని మీ పిన్ని అడిగింది. ఇక్కడ కొందామనుకున్నాను. నావల్ల కావడం లేదు - చీర ఎన్నడం. మీ పిన్నికెలాంటి చీర నప్పుతుందో నువ్వే చూసిపెట్టు" అన్నాడు కొండమాచార్యులు.

అందుకు కవిత ఎంతో సంతోషంగా ఒప్పుకుంది.

ఆమె కొండమాచార్యులకు తనింట్లో భోజనం పెట్టింది. భర్త వస్తే పరిచయం చేద్దామనుకుంది. రాలేదు. కొండమాచార్యులింట్లో ఉండగానే కవితకు నాలుగైదు ఫోన్ కాల్స్ వచ్చాయి. అన్నింటికీ ఆమె శ్రద్ధగా అటెండయ్యింది. ఓపికగా సమాధానాలిచ్చింది.

ఇద్దరూ కార్లో బజారుకి వెళ్లారు. డబ్బు కొండమాచార్యులది. సెలక్షన్ కవితది. కొండమాచార్యులు భార్యకు నేత చీర కొని కవితను మెచ్చుకున్నాడు. ఆయన్ను బస్ స్టాండులో దిగబెట్టేముందామె.."మేస్టా రూ! మీరు రాసిన నవల నాకు పంపండి" అంది.

"ఎందుకమ్మా?"అన్నాడు కొండమాచార్యులు.

"మీకేమీ చెప్పలేను!" అంది కవిత.

“ఆ నవలిప్పుడు నా కూడానే ఉందమ్మా!” అంటూ ఆయన తన మెడకు వేలాడుతున్న సంచీలోంచి ఓ కాగితాల కట్ట తీసి ఆమె కందించాడు.

కవిత ఆ కట్ట అందుకుని చూపింది. తొలి పేజీ మీదే నవల పేరుంది.. ‘పలికించెడివారు’ నవల పేరు.

రచన కొండమాచార్యులు. క్రింద ఆయన చిరునామా ఉంది.

“ఏమిటి మేస్టారూ.. ఈ పేరుకి అర్థం?” అనడిగింది కవిత.

“అర్థమేముందమ్మా! అలనాడు పోతనను భావావేశపూరితుణ్ణి చేసి భాగవతాన్నాయన నోట పలికింపజేశాడు శ్రీరామచంద్రుడు. ఏ సాహిత్యానికైనా పలికేవాడూ, పలికించేవాడూ ఉండాలి. అప్పుడే కావ్యాలు పుడతాయి. ఇప్పుడూ రచయితలున్నారు. వారిని పలికించే వారూ ఉన్నారు. ఫలితంగా సాహిత్యమే ఓ బాగోతమయింది” అన్నాడు కొండమాచార్యులు.

“మేస్టారూ! ఒక్క ముక్కలో నేటి సాహిత్య ధోరణులనెంతో బాగా చెప్పారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పటికీ మీరు రచనా వ్యాసాంగాన్ని కూడా చేపట్టి ఉండాల్సింది” అంది కవిత.

“కొన్ని ప్రయత్నాలు చేశానమ్మా..అన్నీ ఫెయిలయ్యాయి. నేను రాసిన ఒక్క కథా ప్రచురించబడలేదు. ఆ విషయం నేనెవరికీ చెప్పుకోలేకపోయాను. ఆ నా అనుభవాల సంకలనమే ఈ నా “పలికించెడివారు నవల” అన్నాడు కొండమాచార్యులు నిట్టూర్పుతో.

ఇద్దరూ విడిపోయారు. ఒకరు బస్సులో. ఒకరు కారులో - వేర్వేరు గమ్యాలు చేరుకున్నారు.

కవిత తన వద్ద నవల నెందుకు తీసుకుందో రెండు నెలల తరువాత గానీ కొండమాచార్యుల కర్థంకాలేదు.

ఒక పత్రిక నిర్వహించిన నవలల పోటీలో “పలికించెడివారు” నవలకు మొదటి బహుమతి వచ్చింది. మొత్తం పది వేల రూపాయలు. ఆ విషయం ఆయనకు ముందు టెలిగ్రాం, తరువాత ఉత్తరం ద్వారా తెలియపర్చారు.

తన నవలకు బహుమతి ఎలా వచ్చిందో కూడా కొండమాచార్యు లకి బహుమతులు ప్రకటించబడిన పత్రిక చూశాక తెలిసింది.

నవలల ఎంపికలో బహుమతుల నిర్ణయంలో న్యాయనిర్ణేతగా వ్యవహరించింది కవిత!

ఆ మర్నాడే కొండమాచార్యులకు కవిత నుంచి ఉత్తరం వచ్చింది.

“మేస్టారూ! ఒక ఐఏఎస్ ఆఫీసరు భార్యను కావడమొక్కటే నన్ను సాహిత్యంలో న్యాయనిర్ణేతను చేసింది. ఇలాంటి అవకాశం గతంలో నాకు చాలాసార్లు వచ్చినా నా అర్హతలు తెలిసిన నేను నిరాకరిస్తూ వచ్చాను. ఏ విధంగానూ మీకు సాయపడలేని నేనీ విధంగానైనా సాయపడదామని ఈ సారికి అంగీకరించాను. నా సంస్కారంపై ఎంతో గౌరవమున్న మీరు,నన్నపార్థం చేసుకోకూడదని ఈ ఉత్తరం రాస్తున్నాను. నా వల్ల తప్పంటూ జరిగితే మీ నవల ఎన్నిక చేయడం కాదు. ఆ ఎన్నికకు న్యాయనిర్ణేతగా వ్యవహరించడం”

ఉత్తరం చదివిన కొండమాచార్యులు నిట్టూర్చాడు. ఆ తరువాత నుంచి సాహిత్యాన్నొక భాగోతంగా మార్చడంలో ఆయన కూడా తన పాత్రను నిర్వహించడం ప్రారంభించాడు.★

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 10-5-89)*